క్లుప్తంగా

కందకాల పనులు పరిశీలన



కందకాల పనులు పరిశీలిస్తున్న ఏపీవో రవి

మెళియాపుట్టి: కొండచుట్టూ కందకాల తవ్వకాలతో గిరిజన రైతులకు అధిక ఫలసాయం లభిస్తోందని ఉపాధిహామీ పథకం ఏపీవో టి.రవి అన్నారు. పెద్దపద్మాపురం పంచాయతీ పరిధిలోని మామిడిగుడ్డి గ్రామంలో చేపడుతున్న కందకాల పనులను శుక్రవారం పరిశీలించారు. వీటిద్వారా వర్షపునీరు వరదగా గ్రామాల్లోకి రాకుండా అరికట్టడమేకాకుండా.. కందకాల్లో నిల్వ ఉన్ననీరు అడవిలో నివసించే ప్రాణులకు తాగడానికి ఉపయోగపడుతుందని, గిరిపంటలకు అనుకూలంగా ఉంటుందన్నారు. నాణ్యతతో కందకాలు తవ్వాలని వేతనదారులకు సూచించారు. అన్ని గ్రామాలలో కందకాల పనులు చేయడానికి సిబ్బంది చర్యలు తీసుకోవాలని అన్నారు.

చేతిబోర్లు ఏర్పాటు



పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ గోపి

జలుమూరు: అల్లాడపేట గ్రామంలో ప్రజలకు మంచినీటి సౌకర్యం కల్పించేందుకు వీలుగా రెండు చేతిబోర్లను ఏర్పాటు చేస్తున్నట్టు ఎంపీపీ వాన గోపి అన్నారు. ఈ మేరకు బోర్ల ఏర్పాటుకు శుక్రవారం భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. సర్పంచ్ కె.చిన్నమ్మడు, అల్లాడ పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు ఎం.శ్యామలరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు కె.శ్రీనువాసరావు, ఎం.భాస్కరరావు, నాగం హరి పాల్గొన్నారు.

గర్భిణులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



సర్వేలో వైద్యసిబ్బంది

జలుమూరు: గర్భిణులు రోగ్యంపై శ్రద్ధ వహించాలని జలుమూరు పీహెచ్‌సీ మెడికల్ అధికారి చల్ల వంశీకృష్ణ అన్నారు. టి.లింగాలపాడులో ఏఎన్‌సీ సర్వేను శుక్రవారం నిర్వహించి మాట్లాడారు. నెలవారీ టీకాలు వేయించుకోవాలని, అలాగే పౌష్టికాహారం తీసుకోవాలని, రక్తహీనతను అధిగమించాలని గర్భిణులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎస్ చిన రాజులు, సిబ్బంది ఉన్నారు.

100 గంటల అఖండ నామ సంకీర్తన ప్రారంభం



అఖండనామ సంకీర్తన చేస్తున్న భక్తులు

నరసన్నపేట: స్థానిక మారుతీనగర్ సత్యసాయి భవనంలో లోకకల్యాణార్థం 100 గంటల అఖండనామ సంకీర్తన శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభమైంది. ఎనిమిదో తేదీ సాయంత్రం ఆరు గంటల వరకూ సంకీర్తన కొనసాగుతోందని మందిరం కన్వీనర్ ఎంఎల్ నాయుడు తెలిపారు. సత్యసాయి బాబా 99వ జన్మదిన వేడుకల్లో భాగంగా ఈ వంద గంటల నామసంకీర్తన చేస్తున్నట్లు చెప్పారు. ప్రారంభ కార్యక్రమంలో మందిర కమిటీ ప్రతినిధులు మూర్తి, ఎం.అనసూయమ్మ, పి.నాగేశ్వరరావు, పాటోజి నాగేశ్వరరావు, ఆర్.అప్పలస్వామి, జగ్గునాయుడు, ఎల్వీ రమణ, జామి రామచంద్రరరావు, ముద్దాడ గోపాలరావు ఉన్నారు.

సాంకేతిక విద్యను అలవర్చుకోవాలి

పాతపట్నం: విద్యార్థులు చిన్నతనం నుంచే సాంకేతిక విద్యను అలవర్చుకోవాలని స్థానిక ప్రభుత్వ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ కె.వి.రత్నకుమారి అన్నారు. పాతపట్నం ఆదర్శ పాఠశాలలో చదువుతున్న ఇంటర్, పదో తరగతి విద్యార్థులకు దసరా సెలవుల్లో ఒకేషనల్ కోర్సుల్లో ఇంటర్న్‌షిప్‌లో భాగంగా శుక్రవారం నుంచి వివిధ రకాల కోర్సుల్లో అవగాహన కల్పించారు. పది రోజుల పాటు విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ ఉంటుందని, నగరంలో ఉన్న మీ సేవా కేంద్రాలకు విద్యార్థులను తీసుకువెళ్లి అవగాహన కల్పించామన్నారు. అందులో భాగంగా మీ సేవ, ప్రింటర్ కేర్ అండ్ హార్డ్‌వేర్, ఫ్లెక్సీ బ్యానర్స్, కంప్యూటర్ సెంటర్స్, ఫొటో స్టూడియో, టైపు అండ్ జిరాక్సు, కంప్యూటర్ జాబ్ వర్క్స్ సెంటర్ల పని తీరుపై అవగాహన కల్పిస్తున్నట్టు పేర్కొన్నారు. ఇంటర్న్‌షిప్ పర్యవేక్షకులు జి.శకంరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ

సారవకోట: చీడిపూడి ఉపాధిహామీ పథకం ఫీల్డు అసిస్టెంట్‌పై స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏపీడీ లోకేశ్వరరావు శుక్రవారం విచారణ చేపట్టారు. గతంలో జరిగిన ఉపాధి పనులలో అవినీతికి పాల్పడినట్లు ఫీల్డు అసిస్టెంట్‌పై ఫిర్యాదు చేశారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేయనున్నట్లు ఏపీడీవో పేర్కొన్నారు. ఆయనతో పాటు ఏపీవో నారాయణరావు ఉన్నారు.

మినీ గోకులాల గోల!



మినీ గోకులం

గోకులాలకు ప్రభుత్వం ఇచ్చే నిధులు, రాయితీ..			
షెడ్డు	యూనిట్ వ్యయం (రూపాయల్లో)	ప్రభుత్వ నిధులు (రూపాయల్లో)	రైతు వాటా (రూపాయల్లో)
2 పశువులు	1,15,000	1,03,500	11,500
4 పశువులు	1,85,000	1,66,500	18,500
6 పశువులు	2,30,000	2,07,500	23,000
20 జీవాలు	1,30,000	91,000	39,000
50 జీవాలు	2,30,000	1,61,000	69,000
100 కోళ్లు	87,000	60,900	26,100
200 కోళ్లు	1,32,000	92,400	39,600

- అర్హత ఉన్న పాడి రైతులకు దక్కని గోకులం
- మండలాలకు అరకొరగా మంజూరు

ఎల్.ఎన్.పేట: పాడి రైతుల కోసం ప్రభుత్వం మంజూరు చేసిన మినీ గోకులాల లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు అధికారులు తలలు పట్టుకుంటున్నారు. పాడి రైతులు, గొర్రెలు, మేకలు మందలతో పాటు 100 నుంచి 200 (బాయిలర్, నాటు) కోళ్లు కలిగిన యజమానులు వారు పెంచుకునే వాటిని ఒక షెడ్డులో ఉండేందుకు వీలుగా ప్రభుత్వం మినీ గోకులాలు మంజూరు చేసింది. అయితే వీటిని మండలాలకు అరకొరగా కేటాయించటంతో వాటిని అధికారులు జనాభా ప్రాతిపదికన పంచాయతీకి ఒకటి, ఎక్కువ జనాభా ఉంటే రెండోది కేటాయించారు. దీంతో గోకులం కావాలంటే ఎమ్మెల్యే సిఫార్స్ లేఖ ఉంటే వస్తుందని భావించిన రైతులు అధికార పార్టీ నాయకుల చుట్టూ తిరుతుగున్నారు. కొందరు రైతులు అధికారులకు నేరుగా దరఖాస్తులు చేసుకుంటున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం దరఖాస్తుదారునికి మంజూరు చేయాలా? అధికార పార్టీ నాయకుల సిఫార్స్ లేఖ ఉన్నవారికి మంజూరు చేయాలా? అని అధికారులు తర్జన భర్జన పడుతున్నారు.

గోకులం మంజూరుకు అర్హతలు..

ఎస్సీ, ఎస్టీ, వలస డీ-నోటిఫైడ్ తెగల వారు దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారు, మహిళా యజమాని/దివ్యాంగులైన కుటుంబ యజమాని ఉన్నవారు, భూ సంస్కరణ/పీఎం ఏవైజీ లబ్ధిదారులు, అటవీ హక్కుల చట్టం-2006 లబ్ధిదారులు, చిన్న/సన్నకారు రైతులు అర్హులు.

మండలాల వారీగా మంజూరు	
పాతపట్నం నియోజకవర్గం లోని ఐదు మండలాలకు గోకులాల మంజూరు ఇలా..	
మండలం	గోకులాలు
పాతపట్నం	35
కొత్తూరు	34
మెళియాపుట్టి	32
ఎల్.ఎన్.పేట	30
హిరమండలం	30

పై నిబంధనలు ఉన్న వారు అర్హులుగా ప్రభుత్వ నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. మండలానికి మంజూరు చేసిన గోకులాలను యూనిట్‌గా తీసుకుని ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు ఏడు శాతం కేటాయించాల్సి ఉంటుంది.

జతచేయాల్సిన పత్రాలు

గోకులం కావాలనుకునే లబ్ధిదారుడు తన దరఖాస్తు ఫారంతో పాటు ఆధార్, ఉపాధి హామీ పథకం జాబ్ కార్డులు, బ్యాంక్ పాస్ పుస్తకం, సొంత స్థలం హక్కు పత్రం, ఎస్సీ, ఎస్టీలు కుల ధ్రువీకరణ పత్రాల జిరాక్స్‌లను సమర్పించాలి.

పంచాయతీకి ఒక్కటే మంజూరు



మా పంచాయతీకి ఒక్క గోకులం మంజూరు అయిందని అధికారులు చెప్పారు. అదికూడా ఎవరికి వస్తుందో తెలియని పరిస్థితి. గోకులం కట్టుకుంటామని ముందుకు వచ్చిన రైతులందరికీ మంజూరు చేయాలి. పంచాయతీకి ఒక గోకులం మంజూరు చేయటం వలన మిగిలిన రైతులకు అన్యాయం జరుగుతుంది. – పల్లి అప్పలనాయుడు, రైతు, దబ్బపాడు, ఎల్.ఎన్.పేట

ప్రజా సమస్యలు పట్టించుకోని పాలకులు

- మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



ఎల్.ఎన్.పేట: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజా సమస్యలు పట్టించుకోవటం లేదని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు పక్కన పెట్టి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, సానుభూతి పరులు, వైఎస్సార్‌సీపీకి ఓట్లు వేసిన వారిపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు మంచినీరు అందక అనేక ఇబ్బందులు పడుతున్నారని.. తాగునీటి అవసరాలు తీర్చడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. మంచినీటి నాణ్యత పరీక్షల నిర్వహణకు అవసరమైన కిట్లను ఇవ్వలేని దుస్థితిలో చంద్రబాబు ప్రభుత్వం ఉందన్నారు. పాతపట్నం నియోజకవర్గంలో ఇంటింటికీ మంచి నీరు అందించేందుకు సుమారు 360 పనులకు రూ.62 కోట్లను గతంలో వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఎన్నికల ముందు నిలిచిపోయిన పనులు కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలన పూర్తి చేస్తున్నప్పటికీ ముందుకు సాగటం లేదన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే 98 శాతం పనులు పూర్తయ్యావని గుర్తు చేశారు. మిగిలిన రెండు శాతం పనులు పూర్తి చేసి ప్రజలకు నీటిని అందించడంలో చంద్రబాబు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. పనులు పూర్తి చేసి ఇంటింటికీ తాగునీరు అందిస్తే ప్రజలు జగనన్నను గుర్తు చేసుకుంటారని భావించిన చంద్రబాబు ఆ పనులను గాలికి వదిలేశారని వ్యాఖ్యానించారు. ఎన్నికల ముందు ప్రజలను నమ్మించిన సూపర్ సిక్స్ హామీలు ఎప్పుడు అమలు చేస్తారని నిలదీశారు. మహిళలు, రైతులను మోసం చేయటంలో చంద్రబాబు ప్రభుత్వం ఎప్పుడూ ముందు వరుసలో ఉంటుందన్నారు. ఖరీఫ్ సీజన్ పూర్తయి, రబీ సీజన్ ప్రారంభం అవుతున్నా పెట్టుబడి సాయంగా ఇస్తామన్న అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతుకు రూ. 20 వేలు ఎప్పుడు ఇస్తారని ప్రశ్నించారు. మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, నెలకు రూ.1500, ఉచిత గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం, విద్యాదీవెన వంటి పథకాలు ఎప్పుడు అమలు చేస్తారో చెప్పాలన్నారు.

చెవిటమ్మతల్లికి తమ్మినేని పూజలు



చెవిటమ్మతల్లిని దర్శించుకుంటున్న తమ్మినేని కుటుంబ సభ్యులు

ఆమదాలవలస: దుర్గాదేవి నవరాత్రుల సందర్భంగా పట్టణ శివార్లలోని చెవిటమ్మతల్లి అమ్మవారిని మాజీ స్పీకర్, వైఎస్సార్‌సీపీ జిల్లా పార్లమెంటరీ పరిశీలకులు తమ్మినేని సీతారాం కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం దర్శించుకున్నారు. అర్చకులు ప్రత్యేక పూజలు చేయించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు తమ్మినేని చిరంజీవినాగ్ దంపతులు, నాయకులు అల్లంశెట్టి ఉమామహేశ్వరరావు, పొన్నాడ చిన్నారావు ఉన్నారు.

ప్రజాప్రతినిధులను విస్మరించడం తగదు

- మండల సమావేశంలో ఎంపీపీ మురళి



మాట్లాడుతున్న ఎంపీపీ ఆరంగి మురళి

నరసన్నపేట: ప్రభుత్వం మారినంత మాత్రాన స్థానిక సంస్థల్లో ప్రజలచే ఎన్నికైన ప్రజాప్రతినిధులను విస్మరించడం తగదని నరసన్నపేట ఎంపీపీ ఆరంగి మురళి అన్నారు. గ్రామాల్లో ఏ ప్రభుత్వ కార్యక్రమైన ప్రోటోకాల్ మేరకు విధిగా స్థానిక ప్రజాప్రతినిధులను భాగస్వామం చేయాలని కోరారు. ప్రస్తుతం అలా జరగడం లేదని.. ఇదే పద్ధతి కొనసాగితే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండల సమావేశం శుక్రవారం జరిగింది. దీంట్లో పాల్గొన్న ఎంపీపీ మాట్లాడుతూ.. గ్రామాల్లో అధికార పార్టీ వాళ్లు ప్రజాప్రతినిధులు కాకపోయినా వారికి అందలం ఎక్కిస్తున్నారని, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులకు ప్రాధాన్యత ఇవ్వడం లేదని.. ఇది మంచి పద్ధతికాదన్నారు. అధికారులు గమనించి స్థానిక ప్రజాప్రతినిధులకు తగిన ప్రధ్యాన్యత ఇవ్వాలని అధికారులను కోరారు. ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ జరగడం లేదన్నారు. ముఖ్యమంత్రి, ఇతర జిల్లా అధికారులు లబ్ధిదారుల ఇళ్లవద్దకు వెళ్లి పింఛన్లు ఇస్తుంటే మండలంలో మాత్రం వీధుల్లో ఒక చోట, రచ్చబండల వద్ద పంపిణీ చేస్తున్నారని అధికారుల దృష్టికి ఎంపీపీ తీసుకువచ్చారు. అంతకుముందు వివిధశాఖలపై జరిగిన చర్చల్లో జమ్ము సర్పంచ్ వాన గోవిందరావు, దేవాది సర్పంచ్ మంతిన రాములు మాట్లాడుతూ.. రెండో పంటలకు వంశధార నీరు ఇవ్వాలని కోరారు. అలాగే పెసర, మినుము విత్తనాలు కావాల్సిన రైతులు ముందుగానే సంబంధిత రైతు సేవా కేంద్రంలో ప్రతిపాదనలు ఇవ్వాలని వ్యవసాయాధికారి కె.సునీత కోరారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం వంట ఏజెన్సీలను ఇష్టానుసారంగా మారుస్తున్నారని.. ఏ ప్రాతిపదికన మార్పులు చేస్తున్నారని సభ్యులు ప్రశ్నించారు. గత ప్రభుత్వ కాలంలో మంజూరైన ఇళ్లు మార్చి 31వ తేదీలోగా పూర్తి చేయాలని.. తరువాత బిల్లులు ఇవ్వడం జరగదని ఏఈ రాజేంద్రప్రసాద్ అన్నారు.

సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు చింతు అన్నపూర్ణ, ఎంపీడీవో మధుసూదనరావు, తహసీల్దార్ సత్యన్నారాయణ పాల్గొన్నారు.

అబ్దుల్ కలాం అవార్డుకు దుర్గాప్రసాద్ ఎంపిక



నరసన్నపేట: స్థానిక పద్మావతి విద్యా సంస్థల డైరెక్టర్ సీహెచ్ దుర్గాప్రసాద్ ఏపీజే అబ్దుల్ కలాం నేషనల్ ప్రతిభా అవార్డుకు ఎంపికయ్యారు. ఏటా ఉత్తమ విద్యా సంస్థల ప్రతినిధులకు ఈ అవార్డు ఇస్తుంటారు. ఈ ఏడాదికి దుర్గాప్రసాద్‌ను ఎంపిక చేసినట్టు సదరన్ ప్రైవేటు లెక్చరర్స్, టీచర్స్ ఆర్గనైజేషన్(ఎస్‌పీటీఎల్‌ఓ) ఫౌండర్ నాగయ్య శుక్రవారం తెలిపారు. ఈమేరకు దుర్గాప్రసాద్‌కు సమాచారం ఇచ్చారు. అవార్డును కలాం జయంతి సందర్భంగా ఈ నెల 20వ తేదీన గుంటూరులో దుర్గాప్రసాద్‌కు ప్రదానం చేస్తారు.

ఉర్లాంలో నేత్ర వైద్య శిబిరం



రోగులను పరీక్షిస్తున్న సిబ్బంది

నరసన్నపేట: ఉర్లాం గ్రామంలో తర్ర శిమ్మినాయుడు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. దీంట్లో 78 మందిని పరీక్షించగా వీరిలో 30 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. ఉర్లాం పీహెచ్‌సీ వైద్యులు గొలివి సుజాత, ఆప్తాలమిక్ ఆఫీసర్ బాలగంగాధరరాజు పాల్గొన్నారు.

నిర్వాసితులకు న్యాయం చేయాలి



మీసాల వెంకట రామకృష్ణ

హిరమండలం: వంశధార నిర్వాసితుల సమస్యలు పరిష్కరించి వారికి న్యాయం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మీసాల వెంకట రామకృష్ణ కోరారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వంశధార నిర్వాసితులకు అదనంగా పరిహారం అందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల ముందు హామీ ఇచ్చారన్నారు. అధికారం చేపట్టి నాలుగు నెలలు పూర్తయినా నిర్వాసితులకు న్యాయం చేయలేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిర్వాసితులకు ఇచ్చిన హామీ మేరకు అదనపు పరిహారం రూ.216 కోట్లు మంజూరు చేసి మాట నిలబెట్టుకున్నారని గుర్తు చేశారు. అందులో రూ.205 కోట్లు నిర్వాసితులకు అందించారని.. మిగిలిన రూ. 11 కోట్లు అందించాల్సి ఉందన్నారు. అప్పట్లో ఎన్నికల కోడ్, సాంకేతిక సమస్య కారణంగా కొంతమందికి పరిహారం అందలేదన్నారు. ఇప్పుడు కూటమి సర్కార్ నిర్వాసితులకు న్యాయం చేయాలన్నారు.

బాధ్యతల స్వీకరణ

హౌసింగ్ ఏఈగా లక్ష్మీనారాయణ



బూర్జ: మండల హౌసింగ్ ఏఈగా కె.లక్ష్మీనారాయణ శుక్రవారం బాధ్యతలు స్వకరించారు. సరుబుజ్జిలి మండల ఏఈగా పని చేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. లక్ష్మీనారాయణ ఇప్పటి వరకు బూర్జ మండల ఇన్‌చార్జి ఏఈగా కూడా వ్యవహరించారు.

పాతపట్నం ఆర్ఐగా బాబీ..



పాతపట్నం: పాతపట్నం తహసీల్దార్ కార్యాలయ ఆర్ఐగా పండిత బా బాధ్యతలు స్వీకరించారు. వజ్రపుకొత్తూరులో పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన పి.భువన్‌కుమార్ వజ్రపుకొత్తూరు వెళ్లనున్నారు.

మెళియాపుట్టి తహసీల్దార్‌గా పాపారావు..



మెళియాపుట్టి: మండలానికి కేటాయించిన పలువురు అధికారులు బాధ్యతలు స్వీకరించారు. తహసీల్దార్‌గా బడే పాపారావు, వెలుగు ఏపీఎంగా త్రినాథమ్మ, రెవెన్యూ సూపరింటెండెంట్‌గా కె. రాము, రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్‌గా జగన్మోహన్ విధుల్లో చేరారు.

ఈవోపీఆర్డీగా ప్రభాకరరావు



సారవకోట: మండల ఈవోపీఆర్డీగా ప్రభాకరరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన రేణుక నరసన్నపేట బదిలీపై వెళ్లగా.. రణస్థలం నుంచి ప్రభాకరరావు ఇక్కడకు వచ్చారు. ఈయన గతంలో మండలంలో పలు పంచాయతీలలో కార్యదర్శిగా పని చేసి ఉన్నారు.

డీటీగా రవి..

సారవకోట మండల డిప్యూటీ తహసీల్దార్‌గా రౌతు రవి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన మధుబాబు బదిలీపై జలుమూరు మండలం వెళ్లగా కొత్తూరు సివిల్ సప్లయ్ టీడీగా పనిచేసిన రవి ఇక్కడకు బదిలీ పై వచ్చారు. ఇతను కూడా మండలంలో డిటీగా గతంలో పనిచేశారు.

సూపరిటెండెంట్‌గా తిరుపతి పట్నాయక్



పాతపట్నం: పాతపట్నం ఎంపీడీవో కార్యాలయం సూపరిటెండెంట్‌గా తిరుపతి పట్నాయక్ బాధ్యతలు స్వీకరించారు. ఈయన మెళియపుట్టి మండల కార్యాలయం సూపరిటెండెంట్‌గా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన రాజేశ్వరరావు శ్రీకాకుళం జెడ్పీకి బదిలీపై వెళ్లారు. పట్నాయక్‌కు సెక్రటరీలు, కార్యాలయం సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలియజేశారు.

కొత్తూరు తహసీల్దార్‌గా రవిచంద్ర



కొత్తూరు: కొత్తూరు మండల తహసీల్దార్‌గా కట్ట రవిచంద్ర బాధ్యతలు స్వీకరించారు. ఈయన హిరమండలం మండలం నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన పాపారావు మెళియాపుట్టి మండలానికి బదిలీ అయ్యారు. అలాగే మండల సర్వేయర్‌గా రెడ్డి గవరయ్య, సీఎస్‌డీటీగా భీమారావులు బదిలీపై ఇక్కడకు వచ్చారు.

పాతటప్నం సీఐగా రామారావు



పాతపట్నం: పాతపట్నం సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా వి.రామారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన విశాఖపట్నం జిల్లా నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన నల్లి సాయి విశాఖ జిల్లాకు బదిలీపై వెళ్లారు. నూతన సీఐకు పాతపట్నం, మెళియాపుట్టి స్టేషన్ల ఎస్సైలు, స్టేషన్ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలియజేశారు.

ఆమదాలవలస ఎంపీడీవోగా వెంకటరావు



ఆమదాలవలస ఎంపీడీవో వెంకట్రావుకు అభినందిస్తున్న సిబ్బంది

ఆమదాలవలస: ఆమదాలవలస మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా రోణంకి వెంకటరావు బాధ్యతలు చేపట్టారు. అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. గత రెండేళ్ల నుంచి ఆమదాలవలస ఎంపీడీవోగా ఎవరిని నియమించకపోవడంతో ఏఓ ఎస్. వాసుదేవరావు ఇన్‌చార్జి ఎంపీడీవోగా ఇప్పటి వరకూ వ్యవహరించారు. నూతన ఎంపీడీవోను సిబ్బందిని అభినందించారు.

హిరమండలం: మండల ఈవోపీఆర్డీగా డి.గోవిందరాజులు, మండల సర్వేయర్‌గా ఎస్వీ రమణ్య బాధ్యతలు స్వీకరించారు.

'విద్యాశాఖ ఆదేశాలు పాటించాలి'




పాఠశాలను పరిశీలస్తున్న బాలల హక్కుల కమిషన్ సభ్యుడు సీతారాం


ఆమదాలవలస: దసరా సెలవుల్లో పాఠశాలల్లో తరగతులు నిర్వహించరాదని ఒక వైపు ప్రభుత్వం మరోవైపు విద్యాశాఖ అధికారులు, బాలల హక్కుల కమిషన్ ఎంతగా చెబుతున్నప్పటికీ కొన్ని పాఠశాలల యాజమాన్యాలు పట్టించుకోకపోవడం దారుణమని బాలల హక్కుల కమిషన్ సభ్యుడు గొండు సీతారాం అన్నారు. ఆమదాలవలస పట్టణంలోని పలు పాఠశాలలను ఆయన ఆకస్మికంగా శుక్రవారం సందర్శించగా కొన్ని పాఠశాలలు తెరచి ఉండటాన్ని గుర్తించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలకు ఈనెల మూడు నుంచి 13వ తేదీ వరకు ప్రభుత్వం దసరా సెలవులు ప్రకటించిందన్నారు. సెలవుల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలలో తరగతులు నిర్వహించరాదని విద్యాశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేసినప్పటికీ కొంతమంది పట్టించుకోకపోవడం దారుణమని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలే విద్యా శాఖ నిబంధనలు పాటించకపోతే ఎలా అని ప్రశ్నించారు. ముందుగా రైల్వేగేటు సమీపంలోని అశోక పబ్లిక్ స్కూల్‌ను ఆయన సందర్శించగా.. పదో తరగతి విద్యార్థులకు తరగతులు నిర్వహించడాన్ని గుర్తించి యాజమాన్యాన్ని ప్రశ్నించారు. మరోసారి ఇలా జరిగితే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. పాఠశాలలను బాలల హక్కుల కమిషన్ మెంబర్ తనిఖీలు చేస్తున్నారన్న సంగతి తెలిసి బ్రిడ్జి చివరన ఉన్న మరో పాఠశాల యాజమాన్యం పదో తరగతి విద్యార్థులను వెంటనే విడిచి పెట్టేసి పాఠశాలకు తాళాలు వేసేయడంతో చేసేది ఏమీ లేక ఆయన వెనుదిరిగారు. ఈ విషయం మిగిలిన పాఠశాలల యాజమాన్యాలకు తెలియడంతో వారు కూడా విద్యార్థులను విడిచి పెట్టేసి తాళాలు వేసేయడంతో బాలల హక్కుల కమిషన్ మెంబర్ అక్కడి నుంచి వెళ్లిపోయారు.

హిరమండలంలో వి'చిత్రం'!

- 24 గంటల్లో ఇద్దరు తహసీల్దార్లు!



గురువారం బాధ్యతలు స్వీకరించిన రవిచంద్రను అభినందిస్తున్న సిబ్బంది



శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన హనుమంతురావుకు అభినందనలు తెలియజేస్తున్న సిబ్బంది

హిరమండ: అధికారుల బదిలీల్లో చిత్రవిచిత్రాలు చోటుచేసుకుంటున్నాయి. పారదర్శకంగా బదిలీ ప్రక్రియ జరుగుతోందని కూటమి ప్రభుత్వం చెబుతోంది. అధికారులు, ఉద్యోగుల బదిలీల్లో ఎమ్మెల్యేలు జోక్యం చేసుకోవద్దని సీఎం ఆదేశించినట్లు చెబుతున్నా.. వాస్తవ పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది. తాజాగా హిరమండలం మండలంలో తహసీల్దార్ల నియామకం విస్తుగొలుపుతుంది. 24 గంటల వ్యవధిలో ఇద్దరు తహసీల్దార్లు బాధ్యతలు స్వీకరించడం చర్చకు దారితీస్తోంది. సాధారణ బదిలీల్లో భాగంగా అనకాపల్లి నుంచి హిరమండలం మండల తహసీల్దార్‌గా కె.రవిచంద్రను తొలుత నియమించారు. దీంతో ఆయన గురువారం ఇక్కడకు వచ్చి బాధ్యతలు స్వీకరించారు. ఆయన్ని స్థానిక రెవెన్యూ సిబ్బంది అభినందించారు. అయితే ఏమైందో ఏమోగాని మెళియపుట్టి తహసీల్దార్‌గా పని చేస్తున్న ఎస్.హనుమంతురావు సడన్‌గా శుక్రవారం స్థానిక కార్యాలయంలో ప్రత్యక్షమయ్యారు. తనను ప్రభుత్వం హిరమండలం మండల తహసీల్దార్‌గా నియమించిందని చెప్పడంతో సిబ్బంది ఆశ్చర్యానికి గురయ్యారు. వాస్తవంగా మెళియపుట్టి తహసీల్దార్‌గా ఉన్న హనుమంతురావును శ్రీకాకుళం కలెక్టరేట్‌లో హెచ్ సూపరింటెండెంట్‌గా బదిలీ చేశారు. అయితే ఉన్నఫలంగా రెండు రోజుల్లో ఇద్దరు తహసీల్దార్లు కార్యాలయానికి రావడం చర్చకు దారితీస్తోంది. స్థానిక ప్రజాప్రతినిధుల సిఫార్సుతోనే బదిలీలు జరిగినట్లు తెలుస్తోంది. రెండు రోజుల వ్యవధిలోనే ఇద్దరు తహసీల్దార్లు రావడం విమర్శలకు తావిస్తోంది. గురువారం తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన రవిచంద్ర శుక్రవారం కొత్తూరు వెళ్లడం కూడా అనుమానాలకు తావిస్తోంది. ఇది ముమ్మాటికీ రాజకీయ ఒత్తిడేనని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఇసుక ట్రాక్టర్ సీజ్

నరసన్నపేట: గోపాలపెంటలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను నరసన్నపేట పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్ఐ సీహెచ్ దుర్గాప్రసాద్ తెలిపారు.

వాహనాల తనిఖీ

కొత్తూరు: కొత్తూరు పోలీసులు శుక్రవారం రాత్రి వాహనాల తనిఖీ చేపట్టారు. ఒడిశా నుంచి వచ్చిన ప్రతి వాహనాన్ని ఎస్ఐ ఏంఏ అహ్మద్ సిబ్బందితో కలిసి పరిశీలించారు. అపరిచిత వ్యక్తుల వివరాలు నమోదు చేశారు.

గూనభద్ర ఆర్ఆర్ కాలనీ ఫీల్డ్ అసిస్టెంట్ సస్పెన్షన్

కొత్తూరు: గూనభద్ర ఆర్ఆర్ కాలనీ పంచాయతీకి చెందిన ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పెదకోట ప్రసాద్‌ను సస్పెండ్ చేస్తూ డ్వామా పీడీ బి.సుధాకరరావు ఆదేశాలు జారీ చేశారని స్థానిక ఏపీవో ప్రేమలత శుక్రవారం తెలిపారు. గ్రామ సచివాలయ వలంటీర్లకు ఉపాధి పనుల్లో మస్తర్లు వేసినట్లు గ్రామానికి చెందిన గేదెల సురేష్ చేసిన ఫిర్యాదు మేరకు పీడీ విచారణ చేసిన అనంతరం ప్రసాద్‌ను సస్పెండ్ చేసినట్లు ఏపీవో చెప్పారు.

మందిర నిర్మాణానికి రూ. లక్ష వితరణ



చెక్‌ను అందజేస్తున్న కాళీప్రసాద్

హిరమండలం: స్థానిక సత్యసాయి సేవా సమితి నూతన మందిరం నిర్మాణానికి హిరమండలానికి చెందిన సంఘసేవకులు సింహాద్రి కాళీప్రసాద్ లక్ష రూపాయలను విరాళంగా ప్రకటించారు. ఈ మొత్తాన్ని చెక్ రూపంలో రాష్ట్ర, జిల్లా సత్యసాయిసేవాసంస్థల అధ్యక్షులు ఆర్.లక్ష్మణరావు, రామచంద్రరావులకు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్థానిక సత్యసాయి సేవా సమితి మందిరం శిథిలావస్థలో ఉందన్నారు. ప్రజాభాగస్వామ్యంతో మందిరాన్ని పునఃనిర్మించాలని భావిస్తున్నామన్నారు. బాబా వందవ జయంతి నాటికి నూతన మందిరాన్ని పూర్తి చేస్తామన్నారు. సత్యసేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు రామచంద్రరావు, జిల్లా సేవాదళ్ సమన్వయకర్త నాగేశ్వరరావు ఉన్నారు.